టీఎస్ ఆర్జేసీ ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు పెంపు

హసన్‌పర్తి, మార్చి 19: తెలంగాణ గురుకుల జూనియర్ కళాశాల ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2023-24 విద్యా సంవత్సరానికి పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 31వ తేదీ వరకు గడువు పెంచినట్లు జిల్లా కోఆర్డినేటర్ ఇందుమతి తెలిపారు. దరఖాస్తు కోసం www.tsrjdc.cgg.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

హిందీ పరీక్షలో 20 మంది గైర్హాజరు

గిర్మాజీపేట, మార్చి 19: పదో తరగతి హిందీ పరీక్షకు జిల్లావ్యాప్తంగా మంగళవారం 99.80 శాతం విద్యార్థులు హాజరైనట్లు డీఈవో డీ వాసంతి ఒక ప్రకటనలో తెలిపారు. 9,439 రెగ్యులర్ విద్యార్థులకు 9,420 మంది హాజరు కాగా, 19 మంది గైర్హాజరయ్యారు. ఒక ప్రైవేట్ విద్యార్థి గైర్హాజరు కావడంతో రెగ్యులర్, ప్రైవేట్ పాఠశాలల్లో మొత్తం 20 మంది గైర్హాజరైనట్లు డీఈవో తెలిపారు. ఎలాంటి మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని వెల్లడించారు. జిల్లావ్యాప్తంగా 50 పరీక్ష కేంద్రాలను తనిఖీ బృందాలు తనిఖీ చేశాయన్నారు. రుద్రగూడెం జడ్పీహెచ్ఎస్, కారుణ్యజ్యోతి హైస్కూల్, నర్సంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, నర్సంపేట జడ్పీహెచ్ఎస్ మోడల్ స్కూల్, నర్సంపేట జడ్పీహెచ్ఎస్(బాలికలు)ను డీఈవో తనిఖీ చేశారు.

పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

కాశీబుగ్గ, మార్చి 19: వరంగల్ 14వ డివిజన్ పరిధిలోని సుందరయ్యనగర్, బాలాజీనగర్‌లో మంగళవారం ఎనుమాముల పోలీసుల ఆధ్వర్యంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ తిరుపతి మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించినట్లు తెలిపారు. కొత్త వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఎనుమాముల సీఐ పులి రమేశ్, ఎస్సైలు రాజు, నర్సింహారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి : సీపీ

చెక్‌పోస్టును పరిశీలిస్తున్న సీపీ

నర్సంపేట రూరల్, మార్చి 19: ఎన్నికల నిబంధనలు అతిక్రమించి డబ్బు, మద్యాన్ని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా హెచ్చరించారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కోడ్ అమల్లోకి రావడంతో నర్సంపేట మండలంలోని మహేశ్వరం వద్ద ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును మంగళవారం ఆయన పరిశీలించారు. రాజకీయాలకతీతంగా ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని పోలీస్ సిబ్బందిని సీపీ ఆదేశించారు.

పోలీస్ చెక్ పోస్ట్ తనిఖీ

కాజీపేట, మార్చి 19 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కాజీపేట డీజిల్ కాలనీ చౌరస్తాలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్ట్ పాయింట్‌ను వరంగల్ ఈస్ట్‌జోన్ డీసీపీ బారి మంగళవారం తనిఖీ చేశారు. చెక్‌పోస్ట్‌లోని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, స్థానిక పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బలగాలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. నగరంలోకి వచ్చే ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలన్నారు. ప్రతి అంశాన్ని రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. కాజీపేట సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్సైలు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ల తనిఖీ

సంగెం : పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా మండలంలోని పోలింగ్ స్టేషన్లను తహసీల్దార్ రాజ్‌కుమార్ మంగళవారం తనిఖీ చేశారు. కేంద్రాల్లోని మౌలిక వసతులను ఈ సందర్భంగా ఆయన పరిశీలించారు.

నెక్కొండ తండాలో దుర్గామాత గుడి ప్రారంభోత్సవంలో పాల్గొన్న దొంతి

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

నెక్కొండ/చెన్నారావుపేట: ఆధ్మాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. మంగళవారం నెక్కొండ తండాలో ఏర్పాటు చేసిన దుర్గామాత గుడి ప్రారంభోత్సవానికి ఆయన హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అలాగే, పత్తిపాక తండాలో నిర్వహిస్తున్న దుర్గామాత ఉత్సవాల్లో పాల్గొన్నారు. మండలంలోని భోజీపేటలోని పునీత బోజప్ప చర్చిలో జరిగిన మహోత్సవాకి దొంతి హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రజలందరికీ ఏసుక్రీస్తు ఆశీస్సులు ఉండాలని ఆయన కోరారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
★I, **PAMU JYOTHI, W/o. PAMU SRINIVASU,** R/o. H.No. 2-1-666, Gopalapur Cross Road, Vidyaranyapuri Hanumakonda- 506009, changed my name as **RAPOLU JYOTHI, W/o. PAMU SRINIVASU.** Hence forth I shall be called as **RAPOLU JYOTHI, W/o. PAMU SRINIVASU** for all the Purpose.
NTW-14312

CHANGE OF NAME
★I, **DASARI MADHAVI** (Old Name), R/o. H.No. 1-7-105/2, Revenue Colony, Subedari, Hanam konda. 506001, Have changed my Name as **PONUGOTI MADHAVI** (New Name) for all purpose.
NTW-14313

ఉచిత వైద్య శిబిరం
★మార్చి 22, 23 శుక్ర, శనివారం ఉచితంగా డెంటల్ OP చూడబడును. ఉచితంగా డెంటల్ మందులు ఇవ్వబడును. యోగనంద హాస్పిటల్, DLR గార్డెన్ ప్రక్కన, ములుగు. సెల్: 7901234546.
NTW-00

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

చైన్ స్నాచింగ్స్

వరుస చోరీలతో ప్రయాణికుల్లో భయాందోళన

సుబేదారి, మార్చి 19 : హనుమకొండ బస్‌స్టేషన్‌లో వరుస చైన్ స్నాచింగ్ ప్రయాణికులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ బస్‌స్టేషన్‌లో ఇటీవల కరీంనగర్, హైదరాబాద్ రూట్ పాయింట్‌ల వద్ద బస్సు కోసం వేచి ఉన్న మహిళా ప్రయాణికుల మెడలో నుంచి దొంగలు చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడ్డారు. బస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కొన్ని సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. దీంతో కొద్ది రోజులుగా దొంగలు బస్‌స్టేషన్‌ను అడ్డాగా చేసుకొని, గుర్తుపట్టకుండా సీసీ కెమెరాలు లేని రద్దీ ప్రదేశంలో రాత్రిపూట దొంగతనాలకు పాల్పడుతున్నారు. బస్‌స్టేషన్‌లోని హైదరాబాద్, ఖమ్మం, ములుగు, భూపాలపల్లి, భద్రాచలం, కరీంనగర్ పాయింట్ల వద్ద నిత్యం ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఇక్కడి నుంచి రోజుకు వేల సంఖ్యల్లో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. అన్ని పాయింట్ల వద్ద సీసీ కెమెరాలు లేకపోవడంతో దొంగలను పోలీసులు పట్టుకోలేకపోతున్నారు. బస్టాండ్‌లో దొంగలపై నిఘాపై ఆర్టీసీ అధికారులు, పోలీసుల మధ్య సమన్వయం లేదని తెలుస్తోంది. ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఎంపీవోపై దాడి సరికాదు

ఎంపీడీవో ఆంజనేయులు

పరకాల, మార్చి 19 : ప్రభుత్వ అధికారులపై ప్రజాప్రతినిధులు దాడిచేయడం సరికాదని ఎంపీడీవో పెద్ది ఆంజనేయులు అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు ఎంపీవోపై ఎంపీపీ దాడి చేయడాన్ని ఖండిస్తూ స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఎదుట మంగళవా రం నల్ల బ్యాడ్జీలను ధరించి, నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీవో భాస్కర్, ఏపీవో ఇందిర, సూపరింటెండెంట్ శైలశ్రీ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు నిర్వర్తించాలి

- ఫిర్యాదు అందిన వెంటనే స్పందించాలి
- గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

పోచమ్మమైదాన్ : సమావేశంలో మాట్లాడుతున్న అశ్విని తానాజీ వాకడే

పోచమ్మమైదాన్, మార్చి 19: ఎన్నికల విధులను నిష్పక్షపాతంగా నిర్వర్తించాలని అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. పార్లమెంట్ ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో వరంగల్ తహసీల్దార్ కార్యాలయంలో ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ బృందాలతో మంగళవారం ఆమె సమీక్షించారు. మోడల్ కోడ్ ఆఫ్ కాంటాక్ట్ అమల్లో భాగంగా వరంగల్ తూర్పు(106) నియోజకవర్గ పరిధికి సంబంధించిన నోడల్ అధికారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. టీమ్‌లకు ఏదైనా ఫిర్యాదు అందిన వెంటనే ఎఫ్ఎస్‌టీ టీం స్పందించి వారికి కేటాయించిన ప్రాంతానికి చేరుకుని విచారణ చేపట్టి, నగదు గాని, ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే వస్తువులు గాని పట్టుబడితే సీజ్ చేసి, పంచనామా నిర్వహించి కేసు నమోదు చేయాలని సూచించారు. వాహనదారుల వద్ద రూ. 50 వేలకు పైగా నగదు లభిస్తే పంచనామా నిర్వహించి, కేసు నమోదు చేసి ఆ సమాచారాన్ని నోడల్ అధికారికి తెలియజేయాలని సూచించారు. సమావేశంలో బల్దియా అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్, సిటీ ప్లానర్ వెంకన్న, కుడా సీపీవో అజిత్‌రెడ్డి, ఎస్ఈలు ప్రవీణ్‌చంద్ర, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా పరిశీలన

వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో శానిటేషన్, తాగునీటి సరఫరా తీరును గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే పరిశీలించారు. బ్యాంకుకాలనీలో పర్యటించి, తాగునీటి సరఫరాపై ఆరా తీశారు. అలాగే, శానిటేషన్ పర్యవేక్షణలో భాగంగా విధులు నిర్వర్తిస్తున్న పారిశుధ్య సిబ్బందితో మాట్లాడారు. తాగునీటి పైపులైన్ లీకేజీలను అరికట్టేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఆమె వెంట ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్ ఉన్నారు.

పోతన ట్రాన్స్‌ఫర్ స్టేషన్ తనిఖీ

వరంగల్ : గ్రేటర్ 11వ డివిజన్ పోతన నగరంలోని పోతన సెకండ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మంగళవారం తనిఖీ చేశారు. అధికారులతో కలసి ఆమె అక్కడ చెత్తను డంపింగ్ చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఆమె వెంట సీఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శ్యామ్‌రాజ్, ఎల్లాస్వామి, ధరమ్‌సింగ్ తదితరులు ఉన్నారు.

కమిషనర్‌ను కలిసిన వడుప్సా నాయకులు

గ్రేటర్ కమిషనర్‌ను వరంగల్ జిల్లా వడుప్సా ప్రతినిధులు కార్పొరేషన్ కార్యాలయంలో సన్మానించారు. ప్రైవేట్ పాఠశాలల సమస్యలను పరిష్కరించాలని కోరారు. వడుప్సా జిల్లా అధ్యక్షుడు అంకటి వీరస్వామి, ప్రధాన కార్యదర్శి బిల్లా రవి, కోశాధికారి జ్ఞానేశ్వర్ సింగ్, గౌరవ అధ్యక్షుడు ఆడెపు శ్యామ్, వర్కింగ్ ప్రెసిడెంట్ అడెపు వెంకటేశ్వర్లు, ప్రతినిధులు నాగపూరి కిరణ్ కుమార్, వన్నాల గోవిందరాజులు, ముక్కెర రవీందర్, కూరపాటి మోహన్, దాసి సతీశ్ మూర్తి, ముల్క శరత్‌బాబు, వడిచర్ల ప్రసాద్ పాల్గొన్నారు.

'అధికార బలంతో బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు'

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

భీమదేవరపల్లి, మార్చి 19 : అధికార బలంతో బీఆర్ఎస్ నాయకులపై అక్రమంగా కేసులు బనాయిస్తున్నారని జడ్పీటీసీ వంగ రవి మండిపడ్డారు. మంగళవారం మండలంలోని ముల్కనూరులో బీఆర్ఎస్ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకుడు దార్న శ్రీనివాస్ ముల్కనూరు గ్రామంలో చాలా ఏళ్ల కిందటే భూమిని కొనుగోలు చేసినట్లు తెలిపారు. కొందరు కాంగ్రెస్ నాయకుల ప్రోద్బలంతో శ్రీనివాస్ భూమిలోకి కస్తూరి లక్ష్మి వచ్చి కబ్జా చేశారని పేర్కొన్నారు. ఇప్పటికే దార్న శ్రీనివాస్ సర్వే కోసం దరఖాస్తు చేసుకున్నాడని, సర్వే అనంతరం నిజాలు బయటపడతాయన్నారు. సర్వే పూర్తి కాకముందే శ్రీనివాస్ భూమిని కబ్జా చేయడమే కాకుండా శ్రీనివాస్ దంపతులపై అక్రమంగా కేసులు పెట్టారని ఆరోపించారు. వ్యక్తిగత గొడవలకు రాజకీయాలు పులుమవద్దన్నారు. అధికారం ఉందని బీఆర్ఎస్ నాయకులపై అక్రమంగా కేసులు పెడితే ప్రతిఘటిస్తామన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ సంగ సంపత్, బీఆర్ఎస్ నాయకులు అప్పని భిక్షపతి, మండల సురేందర్, కొండ్ర రజనాచారి, రాపెల్లి రాజు, మాడుగుల అశోక్, గుడికందుల రాజు, పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ రాజగోపాల్

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

- సీఐ రాజగోపాల్ గౌడ్ • 'నమస్తే' కథనానికి స్పందన

నల్లబెల్లి, మార్చి 19: పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రాజగోపాల్ గౌడ్ హెచ్చరించారు. టెన్త్ పరీక్షల్లో సోమవారం జరిగిన మాస్‌కాపీయింగ్‌పై 'పదో తరగతి ప్రశ్నాపత్రం లీకైందా?' శీర్షికన మంగళవారం నమస్తే తెలంగాణలో కథనం ప్రచురితమైంది. దీంతో జిల్లా విద్యాశాఖ అధికారులతోపాటు పోలీసులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు స్పందించాయి. రెండో రోజు జరిగిన పరీక్షకు 392 మంది విద్యార్థులకు వందశాతం హాజరయ్యారు. డీఈవో వాసంతితోపాటు సీఐ, ఎస్సై రామారావు, మధుసూదన్, రవీందర్‌తో కూడిన ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పరీక్ష కేంద్రాలను పరిశీలించాయి. అలాగే, ఒంటిగంట వరకు మూసివేయాని జిరాక్స్ సెంటర్ల నిర్వాహకులను ముందస్తుగా హెచ్చరించారు. నకల్ చీటీలు అందించేందుకు యత్నిస్తున్న యువకులతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులకు సీఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. మాస్‌కాపీయింగ్‌ను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

ఎర్రబెల్లిలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

గ్రామాల్లో పోలీసుల కవాతు

వేలేరు, మార్చి 19 : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం వేలేరు మండలంలోని ఎర్రబెల్లి, చింతలతండా గ్రామాల్లో కేంద్ర బలగాలతో కలిసి వేలేరు ఎస్సై డీ హరిత ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, కేంద్ర బలగాలు పాల్గొన్నాయి.

నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

శాయంపేట, మార్చి 19 : నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, మొక్కలను పెంచాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి నాగ పద్మజ అన్నారు. మండలంలోని సూర్యానాయక్ తండా గ్రామాన్ని మంగళవారం ఆమె సందర్శించి, నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా డీఆర్డీవో మాట్లాడుతూ త్వరగా మొలకెత్తే లోకల్ సీడ్స్‌ను నాటాలన్నారు. అలాగే, జిల్లా ప్లాంటేషన్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, ఏవో శ్రీనివాస్ మండలంలోని నూర్జనపల్లి, కాట్రపల్లి, రాజుపల్లి, సాధనపల్లి, వసంతపూర్, గంగిరేణిగూడెం, కొప్పుల, జోగంపల్లి, పెద్దకోడపాక, గోవిందాపూర్ గ్రామాల నర్సరీలను సందర్శించారు. ఎంపీడీవో ఫణిచంద్ర, ఉపాధి హామీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సూర్యానాయక్ తండా నర్సరీలో మొక్కలు పరిశీలిస్తున్న డీఆర్డీవో నాగ పద్మజ

రోడ్డు ప్రమాదంలో నిట్ విద్యార్థి మృతి

హనుమకొండ చౌరస్తా, మార్చి 19 : హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో వరంగల్ నిట్‌కు చెందిన విద్యార్థి మృతి చెందాడు. వరంగల్ నిట్‌లో ఉత్తరప్రదేశ్‌కు చెందిన క్షితిశ్‌రాజ్ ఈఈఈ ఫైనలియర్ చదువుతున్నాడు. హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ కంపెనీలో స్నేహితుడికి ఇంటర్వ్యూ ఉండడంతో నిట్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులతో కలిసి వెళ్లాడు. అక్కడ ఓ కారును అద్దెకు తీసుకుని వెళ్తుండగా అర్ధరాత్రి తార్నాకలోని ఇఫ్లూ వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. కారు పల్టీ కొట్టడంతో ఈ ప్రమాదంలో క్షితిశ్‌రాజ్ తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందగా మిగతా వారు క్షేమంగా ఉన్నట్లు సమాచారం.

వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై వృద్ధుడు..

రాయపర్తి : రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందిన ఘటన మైలారంలోని వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై మంగళవారం జరిగింది. ఎస్సై వడ్డే సందీప్‌కుమార్ కథనం ప్రకారం.. ములుగు జిల్లాలోని ములుగు మండలం జాకారం గ్రామానికి చెందిన వల్లెపు ఉప్పలయ్య(70) మండలంలోని మైలారంలో తమ బంధువుల ఇంట్లో జరిగిన గ్రామదేవతల పండుగకు హాజరయ్యాడు. తిరిగి స్వగ్రామానికి వెళ్లేందుకు మంగళవారం జాతీయ రహదారిపై బస్సు కోసం వేచిచూస్తున్నాడు. ఈ క్రమంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

వేణుగోపాల్‌కు గులాబీ కండువా కప్పుతున్న నిరంజన్‌రెడ్డి

బీఆర్ఎస్‌లో చేరిన వేణుగోపాల్

హసన్‌పర్తి, మార్చి 19: బీఎస్పీ వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జి, స్వేరోస్ ఇంటర్నేషనల్ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు చాతల్ల వేణుగోపాల్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ భవన్‌లో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి సమక్షంలో మంగళవారం బీఆర్ఎస్‌లో చేరారు. ప్రతి కార్యకర్తను బీఆర్ఎస్ కంటికి రెప్పలా కాపాడుకుంటుందని మాజీ మంత్రి అన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏసీపీ నందిరాంనాయక్

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

- గొడవలు చేస్తే కఠిన చర్యలు ■ ఏసీపీ నందిరాంనాయక్

గిర్మాజీపేట, మార్చి 19: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో ఉండాలని, అల్లర్లు సృష్టించడం, గొడవలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ హెచ్చరించారు. మంగళవారం ఆయన ఇంతెజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. తమ భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని అన్నారు. ఆయన వెంట సీఐ మచ్చ శివకుమార్, సిబ్బంది ఉన్నారు.

హైస్కూల్ సందర్శన

కాశీబుగ్గ : వరంగల్ కాశీబుగ్గలోని ప్రభుత్వ నరేంద్రనగర్ హైస్కూల్‌ను ఏసీపీ నందిరామ్‌నాయక్ సందర్శించారు. పదో తరగతి పరీక్ష కేంద్రంలో మౌలిక సదుపాయాలు, ఏర్పాట్లను పరిశీలించినట్లు ఆయన తెలిపారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

కాజీపేట, మార్చి 19 : కాజీపేట 61వ డివిజన్ పరిధి చైతన్యపురి కాలనీలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో 22వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి పద్మావతీ గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి కలాణ్యం ఘనంగా నిర్వహించారు. శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల రఘునాథాచార్యుల నేతృత్వంలో టీకే రామకన్నన్ ఆధ్వర్యంలో శ్రీమాన్ టీకే శ్రీనివాసన్ పర్యవేక్షణలో వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు సాయంత్రం ఉత్సవ విగ్రహాలను ఆలయ ప్రధాన వీధుల్లో ఊరేగించి కల్యాణ మండపానికి తీసుకొచ్చారు. కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ప్రత్యేక పూజల్లో ఆలయ కమిటీ బాధ్యులు పంజాల అశోక్ కుమార్, కెప్టెన్ వడ్డేపల్లి నరేందర్, పెద్ది అశోక్‌కుమార్, వెంకట మల్లారెడ్డి, దిలీప్ కుమార్, శనిగరపు సుజాతా రాజమోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

సమావేశంలో మాట్లాడుతున్న నన్నపునేని నరేందర్

నాయీ బ్రాహ్మణుల ఆదరణ మరువలేనిది

గిర్మాజీపేట, మార్చి 19: గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో తనపై చూపిన ప్రేమాభిమానాలకు నాయీబ్రాహ్మణులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఎలకంటి సతీశ్ ఆధ్వర్యంలో మంగళవారం వరంగల్ తూర్పు నాయీ బ్రాహ్మణ సంఘం నిర్వహిస్తున్న కాకతీయ పరపతి సంఘం రెండో వార్షికోత్సవానికి ఆయన హాజరై మాట్లాడారు. నాయీబ్రాహ్మణుల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు నరేందర్, వివిధ జిల్లాల సభ్యులు, వరంగల్ తూర్పు నాయీ బ్రాహ్మణులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా హిందీ పరీక్ష

హనుమకొండ : పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ చౌరస్తా/హనుమకొండ/సుబేదారి, మార్చి 19 : హనుమకొండ జిల్లాలో పదోతరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మంగళవారం జరిగిన హిందీ పరీక్షలో రెగ్యులర్ విద్యార్థులు 11,985గాను 11,971 విద్యార్థు లు హాజరైనట్లు డీఈవో అబ్దుల్‌హై తెలిపారు. కాగా, రెడ్డి కాలనీలోని బాసిత్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ సిక్తాపట్నాయక్ తనిఖీ చేశారు. అలాగే, హనుమకొండలోని మర్కజీ హైస్కూల్‌లో పరీక్ష కేంద్రాన్ని సీపీ అంబర్ కిశోర్ ఝా తనిఖీ చేశారు. పరీక్ష నిర్వహణ, పోలీసు బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్ష కేంద్రం సమీపంలో సభలు, సమావేశాలకు అనుమతులు ఇవ్వవద్దని, కేంద్రాల పరిసరాల్లో నో సెల్‌ఫోన్ జోన్, సమీపంలో జిరాక్స్ సెంటర్లు మూసి వేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

న్యాక్ ఆన్‌లైన్ సమావేశంలో పాల్గొన్న కేయూ వీసీ రమేశ్

కేయూ వీసీతో న్యాక్ సమావేశం

హనుమకొండ చౌరస్తా, మార్చి 19 : బెంగళూర్ నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్(న్యాక్) నిర్వహించిన ఆన్‌లైన్ సమావేశంలో విశ్వవిద్యాలయ కమిటీ హాల్ నుంచి కేయూ వీసీ రమేశ్ పాల్గొన్నారు. జాతీయ విద్యావిధానంలో భాగంగా అంతర్జాతీయ స్థాయి ప్రమాణాల కోసం నిర్వహించిన ఈ సమావేశంలో న్యాక్ ఉన్నతాధికారులతోపాటు దేశంలోని వివిధ యూనివర్సిటీల వీసీలు, జాతీయ సంస్థల డైరెక్టర్లు, అటానమస్ కాలేజీల ప్రిన్సిపాళ్లు 800 మందికి పైగా పాల్గొన్నారు. రాబోయే రోజుల్లో న్యాక్ అక్రిడిటేషన్ విధానం, ప్రస్తుతం ఉన్న విధానంలో చేపడుతున్న విధానపరమైన నిర్ణయాలు, విద్యా సంస్థలు, విద్యార్థులకు కల్పించాల్సిన సౌకర్యాల గురించి చర్చించారు. కార్యక్రమంలో వీసీతోపాటు రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి, నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ సంచాలకులు ఆచార్య పీ కృష్ణమాచారి, ఆచార్య ఎస్ నరసింహాచారి, ఎన్ గోపీకృష్ణ పాల్గొన్నారు.

అధిక సాంద్రత పత్తి సాగుతో రైతులకు మేలు

వర్ధన్నపేట, మార్చి 19: అధిక సాంద్రత పత్తి సాగు వల్ల రైతులకు మేలు కలుగుతుందని పీవీ నర్సింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలోని మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త సీహెచ్ సౌమ్య అన్నారు. వర్ధన్నపేట రైతు వేదికలో మంగళవారం అధిక సాంద్రత పత్తి సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. గులాబీ రంగు పురుగు ఉధృతి తక్కువగా ఉంటుందన్నారు.

వాతావరణ పరిస్థితులపై అవగాహన

కాశీబుగ్గ, మార్చి 19: వరంగల్ 3వ డివిజన్ పైడిపల్లిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో మంగళవారం పరిశోధన, విస్తరణ సలహా సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వాతావరణ విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ లీలారాణి వాతావరణ పరిస్థితులపై క్లుప్తంగా వివరించారు. 11 జిల్లాలో చేపట్ట దగిన ఆపత్కాల పంటలపై జిల్లాల వారీగా వివరించారు. అలాగే, జిల్లా వ్యవసాయశాఖ అధికారులతో అభ్యుదయ రైతులతో పంటల వారీగా వివిధ సబ్ కమిటీలను ఏర్పాటు చేశారు. యూనివర్సిటీ సంచాలకుడు రఘురామిరెడ్డి, సంచాలకుడు రావుల ఉమారెడ్డి, శాస్త్రవేత్తలు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

సేవే లక్ష్యంగా రోటరీ క్లబ్ కార్యక్రమాలు

సీకేఎం దవాఖానలో వీల్ చైర్లు, స్ట్రెచర్లు అందిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

వరంగల్‌చౌరస్తా, మార్చి 19: మానవ సేవే మాధవ సేవ నినాదంతో ప్రజా సేవే లక్ష్యంగా రోటరీ క్లబ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని రోటరీ 3150 క్లబ్ గవర్నర్ బుసిరెడ్డి శంకర్‌రెడ్డి అన్నారు. లక్ష రూపాయల విలువైన ఆరు వీల్ చైర్లు, ఆరు స్ట్రెచర్లను వరంగల్ సీకేఎం హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ నిర్మలాకుమారికి మంగళవారం అందజేశారు. దవాఖానకు వచ్చే మహిళల అవసరాలను దృష్టిలో ఉంచుకొని హాస్పిటల్‌కు పరికరాలు అందించేందుకు కృషి చేసిన వరంగల్ విభాగం అధ్యక్షుడు రవీంద్రనాథ్‌ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు కేవీఎన్ శిరీష్‌కుమార్, గంగోజుల నరేశ్, మనోహర్‌రెడ్డి, రాజిరెడ్డి, రాంరెడ్డి, సతీశ్, విజయ్, రవీందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ప్రవీణ్‌రావు, శ్రవణ్, మంజుల, బిందు, రామలక్ష్మి, స్రవంతి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ పారిశుధ్య కార్మికుడి మృతి

వరంగల్, మార్చి 19 : మేడారం జాతర విధులు ముగించుకొని వస్తుండగా గట్టమ్మ దేవాలయం వద్ద రోడ్డు ప్రమాదానికి గురైన పారిశుధ్య కార్మికుడు బొట్ల దేవానంద్ దవాఖానలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. అతడికి భార్య, కుమారుడు ఉన్నారు. మేడారం జాతరలో పారిశుధ్య విధులు నిర్వహించేందుకు బల్దియా తరఫున వెళ్లిన దేవానంద్ ఫిబ్రవరి 27న తిరిగి వస్తుండగా గట్టమ్మ దేవాయం వద్ద అతడు వస్తున్న స్వచ్ఛ ఆటోను లారీ ఢీ కొట్టింది. దీంతో దేవానంద్‌కు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ములుగు దవాఖానకు తరలించి, ప్రాథమిక చికిత్స అనంతరం వరంగల్ ఎంజీఎం దవాఖానకు తీసుకెళ్లారు. అతడి పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. మంగళవారం చికిత్స పొందుతూ దేవానంద్ మృతి చెందాడు. పోస్టుమార్టం కోసం మృతదేహానికి ఎంజీఎం దవాఖానకు తీసుకొచ్చారు. పలు కార్మిక సంఘాల నాయకులు అతడి మృతదేహాన్ని సందర్శించి, బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు.

జాతర కమిటీ చైర్మన్‌గా సురేశ్

దామెర, మార్చి 19 : మండలంలోని కోగిల్వాయి శ్రీచంద్రగిరి చెన్నకేశవస్వామి జాతర కమిటీ చైర్మన్‌గా గుండా సురేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తన ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, ఎంపీటీసీ సంగనబోయిన మౌనికాకిరణ్, మాజీ ఉపసర్పంచ్ గోల్కొండ సాంబయ్య, జంగిలి వేణుకు సురేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

దివ్యాంగులు ఓటుహక్కు వినియోగించుకోవాలి

వరంగల్ చౌరస్తా, మార్చి 19: దివ్యాంగులు, వృద్ధులు ఓటుహక్కు వినియోగించుకోవాలని గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన స్వీప్ -2024 (సిస్టమాటిక్ ఓటర్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. వరంగల్ తూర్పు నియోజకవర్గం పరిధిలో 12 వేల మంది దివ్యాంగ ఓటర్లు ఉన్నారని, వారంతా బాధ్యతగా ఓటుహక్కు వినియోగించుకోవాలని కోరారు. ఫామ్-8 సమర్పణ ద్వారా పీడబ్ల్యూడీ మార్కింగ్ ఇవ్వాలని, 12(డీ) ఫాం సమర్పించి హోం ఓటింగ్ నమోదు చేసుకోవచ్చన్నారు.